క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ఎంవీపీ కాలనీకి చెందిన పూర్తి రజాక్ అనే విద్యార్థిని రచించిన పుస్తకాన్ని డీఈవో ఎల్.చంద్రకళ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రజాక్‌కు చిన్ననాటి నుంచి సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉంది. సమాజంలోని సమస్యల పరిష్కారంలో యువత పాత్ర ఎలా ఉండాలనేది తన రచనల ద్వారా తెలియజేశారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ చదువుతో పాటు, సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని, పూర్తి రజాక్ ఆ దిశగా ముందుకెళ్తుండడం అభినందనీయమన్నారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మణరావు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రెడాయ్ వితరణ



ఉపాధ్యాయులకు ఎలక్ట్రికల్ మెటీరియల్ అందిస్తున్న క్రెడాయ్ సంస్థ ప్రతినిధులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు అంబేడ్కర్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు క్రెడాయ్ విశాఖపట్నం సంస్థ సహకారం అందించింది. ఈ పాఠశాలను బుధవారం ఆ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. సీఎస్ఆర్ నిధులతో రూ.1.25 లక్షలు విలువ చేసే ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వస్తువులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ విశాఖపట్నం వైస్ ప్రెసిడెంట్లు ఇ.అశోక్‌కుమార్, సీహెచ్.గోవిందరాజు, సెక్రటరీ వి.శ్రీను, జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా సుధాకర్



మాణిక్యంనాయుడును సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్‌గా ఇక్కడ సీనియర్ అధ్యాపకునిగా పనిచేస్తున్న ఎల్.సుధాకర్ నియమితులుకాగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన మాణిక్యంనాయుడు విజయనగరం డైట్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఛాత్రోపాధ్యాయులకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అధ్యాపకులు త్రినాథరావు, మాధవి, హరిణి, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

తీరం.. పరిశుభ్రత



తీరంలో సేకరించిన వ్యర్థాలతో విద్యార్థులు

ఆరిలోవ: పునీత సాగర్ అభియన్ పేరుతో ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం సాగరతీరాన్ని శుభ్రం చేశారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌వోలు వరలక్ష్మి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై యుద్ధం

- ముందస్తు చర్యలకు జోన్-3 అధికారుల కృషి
- ఏఎన్ఎంలతో ఇంటింటి సర్వే, అవగాహన
- విస్తృతంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం



సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్త



కుండీలో నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది

ఎంవీపీ కాలనీ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. జీవీఎంసీ ఆరోగ్యశాఖ విభాగం సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టింది. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో జోన్-3 ఆరోగ్య, మలేరియా విభాగ ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటి ప్రచారంతో పాటు అవగాహన కార్యక్రమాలు, సర్వేలు విస్తృతంగా చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని వార్డుల్లోనూ ఇంటింటి సర్వే పూర్తయింది. జ్వరం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే స్థానిక ఆశా వర్కర్లకు సమాచారం అందించాలని సర్వే ద్వారా వెల్లడించారు. ఇంటి పరిసరాలు, నీటి తొట్టెల పరిశుభ్రతపై తగు సూచనలు చేశారు.

గత ఆరు నెలల్లో 8 కేసులు

గత ఆరు నెలల్లో జోన్-3 పరిధిలోని 14 వార్డుల్లో 8 కేసులు నమోదైనట్లు జోన్-3 హెల్త్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వెల్లడించింది. ఇందులో 7 డెంగ్యూ కేసులు కాగా.. ఒకటి మలేరియా కేసు ఉన్నట్లు తెలిపింది. డెంగ్యూ కేసులు పెదజాలరిపేట, సీతంపేట ప్రాంతాల్లో నమోదైనట్లు తెలిపారు. 14వ వార్డులో మలేరియా కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సీజన్‌లో వ్యాధులకు ముందస్తు నివారణే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 1న ప్రారంభమైన డెంగ్యూ నివారణ మాసోత్సవాలు ఈ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి. ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, స్థానిక హెల్త్ సెక్రటరీలు సంయుక్తంగా అవగాహన ర్యాలీలు, శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు మలేరియా విభాగం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తోంది. నిల్వ నీటిని నివారించడం, ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై అవగాహనతో పాటు మురికివాడల్లో పర్యటించి ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు.

ఆ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

గత ఆరు నెలలుగా డెంగ్యూ కేసులు నమోదులో ప్రథమంగా ఉన్న పెదజాలరిపేట, సీతంపేట ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఇక్కడ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను అప్రమత్తం చేశాం. అదనపు సిబ్బందితో పాటు పూర్తి స్థాయిలో ఓ సూపర్ వైజర్‌ను అందుబాటులో ఉంచాం. 6 నెలల్లో 7 కేసులు నమోదైన ఈ ప్రాంతంలో సైతం జీరో కేసుల లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నాం.

– బి.శ్రీనివాస్,
మలేరియా జోనల్ ఇన్‌స్పెక్టర్, జోన్-3

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో 8, 9 తేదీల్లో ఆరోగ్య సదస్సు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఈ నెల 8, 9 తేదీల్లో ఆరోగ్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆశ్రమం నిర్వాహకుడు సౌమ్యానంద్ అవధూత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం-దీర్ఘాయుస్సు అనే అంశంపై అనుభవిజ్ఞులైన వైద్యులు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆరోగ్య సూచనలతో పాటు ఆహారం, బయో సైకాలజీ, ఆరోగ్యం ఔషధ మూలం, వంట గదిలో ఔషధాలు, వ్యాధి కారకాలు, తదితర వాటిపై సూచనలు, సలహాలు చేస్తారని తెలిపారు. ఈ సదస్సు ఆయా రోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 10న ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మధుమేహం, బీపీ, పక్షవాతం, క్యాన్సర్, తదితర బాధితులకు ప్రత్యేకంగా సలహాలు, సూచనలు ఇవ్వడానికి వైద్య సదస్సు నిర్వహించనున్నామన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవడానికి, మరింత సమాచారం కోసం 90305 02164 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

ఆరిలోవ: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. 10 ఏళ్ల వయస్సున్న కోటి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ఉదయం తప్పిపోయి తిరుగుతున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆ బాలుడిని పోలీసు స్టేషన్‌కు తరలించి ఆరా తీశారు. బాలుడు తల్లిదండ్రులు కృష్ణ, భావని గుర్తించారు. సీఐ రామారావు సమక్షంలో సాయంత్రం వారికి బాలుడిని అప్పగించారు. దీంతో ఆ తల్లిదండ్రులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ రామారావు

వాసవీ క్లబ్ విశేష సేవలు



మాజీ లెఫ్టినెంట్ కల్నల్ వెంకటరెడ్డిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

ఆరిలోవ: వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు పాలకుర్తి గాయత్రి సూచన మేరకు జిల్లాలోని వాసవీ క్లబ్ సభ్యులు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఎంవీపీ కపుల్స్ క్లబ్ బుధవారం 5 రకాల సేవలు చేశారు. ఓ నిరుపేద రైతుకు పరికరాలు, ఎరువులు అందజేశారు. అలాగే పదవీ విరమణ చేసిన లెఫ్టినెంట్ కల్నల్ బల్లి వెంకటరెడ్డిని సన్మానించారు. ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. పది మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఓ చిరు వ్యాపారికి రూ. 20వేలు వడ్డీ లేని రుణాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ఉపాధ్యక్షులు షేర్ల మహేష్, నూకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా వసతి గృహాల నిర్వహణ

ఆరిలోవ: విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వసతి గృహాలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్సీ వెల్ఫేర్ డీడీ రమణారావు సూచించారు. ఎంవీపీ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వసతి గృహాల్లో నూ బయోమెట్రిక్ సమస్యలు లేకుండా జాగ్రత్త లు తీసుకోవాలని సూచించా రు.100 శాతం ప్రవేశాలు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో పలువురు సంక్షేమ శాఖ అధికారులు, వసతి గృహాలు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రమణారావు

నేడు సహస్ర తులసి దళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం కోటి శ్రీవిష్ణు సహస్రనామ సామూహిక పారాయణ బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆచార్య సార్వభౌమ డాక్టర్ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ వల్ల లోక కల్యాణంతో పాటు విశ్వశాంతి కలుగుతాయన్నారు. భక్తులందరూ ముక్తకంఠంతో సామూహికంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సుబ్రహ్మణ్యశాస్త్రి

కల్యాణం.. కమనీయం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఐటీ హిల్స్‌కు బస్సు పునరుద్ధరణ

దాబాగార్డెన్స్ : ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే ఉద్యోగుల సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ 25-టి సర్వీసును పునరుద్ధరించిందని, ఉద్యోగులు ఈ సర్వీసును వినియోగించుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వయా కొమ్మాది, మారికవలస మీదుగా ఐటీ హిల్స్ వెళ్తుందని, ఉదయం 6, 8, 10.45, సాయంత్రం 4, 6 గంటలకు బయలుదేరుతుందని చెప్పారు. అలాగే కార్‌షెడ్ నుంచి ఉదయం 6.30, 8.30, 9.30, మధ్యాహ్నం 12.30, 1.30, 2.30, సాయంత్రం 4.30, 6.30కి బయలుదేరుతుందని, ఐటీ హిల్స్ నుంచి ఉదయం 7, 9, 9.55, మధ్యాహ్నం 12, 1, 2, 3, సాయంత్రం 5, 7 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు.

బాలికల కళాశాల వసతిగృహం ప్రారంభం

భీమునిపట్నం: చిప్పాడలోని దివీస్ ల్యాబొరేటరీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.35 లక్షలతో ఆధునికీకరించిన భీమునిపట్నం ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం భవనాన్ని కలెక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ యాజమాన్యం బాలికల వసతి గృహాన్ని ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. అనంతరం వసతి గృహం ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహం భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కొనసాగుతున్న పోర్టు కార్మికుల నిరవధిక దీక్షలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఈ శిబిరాన్ని సందర్శించిన శ్రీనివాస్ మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకునే వరకూ పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం స్పందించి నిర్వాసిత కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, అన్నపూర్ణ, భారత్ బచావ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొవిరి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు, కోశాధికారి వాసుపల్లి ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కాంగ్రెస్ పార్టీ సంఘీభావం

గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో జెర్రిపోతుల ముత్యాలు, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

- ఏఎస్సార్ నగర్ పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ఏఎస్సార్ నగర్‌వాసులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో బుధవారం జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ.. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, జీవీఎంసీ, టిడ్కో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపా హనోకు మాట్లాడు తూ మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేయాలని కమిషనర్‌ను కోరారు. లబ్ధిదారులు గ్రీన్ బెల్ట్, రోడ్డు పక్కనే తాత్కాలిక నివాసాల్లో నివసిస్తున్నారని వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయిస్తే ఇక్కడ సమస్యలు తీరుతాయని తెలిపారు. కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఏఎస్సార్ నగర్‌లో 280 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, వాటి చుట్టూ సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈ పనులు 15 రోజుల్లో పూర్తయ్యేలా చూడాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్‌ను ఆదేశించారు. లబ్ధిదారుల జాబితా ప్రకారం ఇళ్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడుకు కమిషనర్ సూచించారు. స్థానిక పరిసరాల్లో గ్రీనరీ, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు, భూగర్భ డ్రైనేజీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. పర్యటనలో జోన్-5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఏపీడీ పద్మావతి, టిడ్కో హౌసింగ్ సహాయక ఇంజనీర్, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సీనియర్ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, నాయుడు, సురేష్, బాబూరావు, మహేష్ ఏఎస్సార్ నగర్ కాలనీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆరిలోవ: చెత్త పన్ను, విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా బుధవారం రవీంద్రనగర్ బస్ స్టాప్ వద్ద సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు సంక్షేమ పాలన అందిస్తున్నామంటూ మరో వైపు ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను, జీవీఎంసీ బలవంతంగా విధించిన చెత్తపై పన్నును వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చెత్త పన్ను చెల్లించకపోతే సంక్షేమ పథకాలు ఆపేస్తామని బెదిరించడం మంచిదికాదన్నారు. గతంలో వాడిన విద్యుత్‌కు కూడా ఇప్పుడు బిల్లులు వసూలు చేయడం మంచి విధానం కాదన్నారు. అనంతరం రవీంద్రనగర్‌లో సచివాలయం సిబ్బందికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.శంకర్, బి.గౌరి, డి.నాగరాజు, రమణ, తవిటినాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మద్దిలపాలెం : పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ సచివాలయం వద్ద బుధవారం సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ ట్రూ అప్, ఫిక్స్‌డ్ వంటి చార్జీలను ప్రభుత్వాలే భరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2020లో విద్యుత్ సంస్కరణలు తెచ్చిందన్నారు. ఈ సంస్కరణలను బీజేపీ పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.వి.ఎన్.చలపతి, జి.రమణ, ప్రదీప్, కుమార్‌మంగళం, అనపర్తి అప్పారావు, కుమారి, వెంకటరావు పాల్గొన్నారు.



పిఠాపురం కాలనీ సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మహిళలకు కుట్టు శిక్షణ


మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మురళీనగర్‌లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని అఫ్సర్ ఖాన్ ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు జాకెట్ల తయారీకి కటింగ్ విధానాన్ని అఫ్సర్ ఖాన్ వివరించారు. దారాలు, క్లేతో ఆభరణాల తయారీ విధానంపై హిమబిందు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.పుష్పలత, మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

12న కొబ్బరి చెక్కలకు వేలం

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఈనెల 12న కొబ్బరి చెక్కలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. రెండు సంవత్సరాల కాల పరిమితికి ఈ వేలం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 2025 జులై 31 వరకు దీని కాల పరిమితి ఉంటుందన్నారు. రూ. 5 వేలు ప్రథమ ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం జరుగుతుందన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో జరిగి న కవి సమ్మేళనం అందరినీ అలరించింది. ప్రధాన వక్త రచయిత కె.జి. వేణు మాట్లాడుతూ సామాజిక బాధ్యతల్లో మనో వైజ్ఞానిక అంశాల పరిష్కారం దిశగా కవులు రచనలు చేయాలని సూచించారు. కవిత్వం ఒక మిత్రుడి వంటిదని, సర్వ కాలాల్లో ఆదరణ పొందుతుందన్నారు. ప్రముఖ కవి ముక్దుం మొహియుద్దీన్ గురించి సభకు పరిచయం చేశారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ భాష సంస్కృతుల వికాసానికి, ఉన్నతికి కవులు, రచయితలు కృషి చేయాలన్నారు. వివిధ కవిత్వ ప్రక్రియల్లో నవ కవిత అందరినీ అలరించేలా ఉండాలని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చిన సూర్యనారాయణ, బి.రాధారాణి, కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత తదితరులు వివిధ అంశాలపై చదివిన కవితలు అలరించాయి.



మాట్లాడుతున్న రచయిత వేణు

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక స్థితి సరిగా లేని ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార టీపీటీ కాలనీ సునీత నర్సింగ్ హోమ్ ప్రాంతంలో సత్యనారాయణ(40) తన తల్లితో కలిసి నివసిస్తున్నాడు. మృతుడు పెయింటింగ్, కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. అతడి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలోని ఫ్యాన్‌కు చీర కట్టి ఉరిపోసుకుని మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు ద్వారకా జోన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.